

"ఇదిగో, చూడు - ఎవరో వచ్చారు నీ కోసం." శ్రీవారు చెప్పారు పూజ గది గుమ్మంలో నిల్చుని.

'ఎవరో! అసలు విషయం ఏమిటో కనుక్కుని తనే మాట్లాడి పంపించకూడదూ!' అనుకుంటూ చదువుతున్న లలితా సహస్రనామ స్తోత్రం మధ్యలో ఆపేసి, ముఖానికి పట్టిన చెమటను తుడుచుకుంటూ గదిలో నుంచి బయటకు వచ్చాను.

హాల్లో రామం మా వారి ఎదురుగా కుర్చీలో కూర్చుని ఉన్నాడు.

ముఖం ఎందుకో వడలిపోయి ఉంది.

"ఏమిటి, రామం?" నే నడగకముందే, నన్ను చూడగానే కుర్చీలో నుంచి లేచి నిల్చుని - "దాక్షాయణి గారు పోయారటండీ! ఉదయం కబురొచ్చింది. ఇక్కడకు తీసుకువస్తున్నారట. అమ్మ మీతో చెప్పమంటే చెప్పి వెళ్దామని వచ్చాను. పదకొండవుతుందేమో వా ళ్ళిక్కడకు వచ్చేసరికి" అంటూ చెపుతున్నాడు.

"దాక్షాయణి వెళ్ళిపోయిందా!" నిశ్చేష్ట నయిపోయి గుమ్మానికి ఆనుకుని నిల్చుండిపోయాను. నా కళ్ళముందు పదిహేను రోజుల క్రితం కొడుకుతోపాటు కారెక్కుతూ - "ఎందుకో ఇక మళ్ళీ నిన్ను చూడలేనేమో ననిపిస్తోంది, వసుధా! శ్రీధరం, రమ ఇద్దరూ అమాయకులే. కాస్త వాళ్ల బాధ్యత నువ్వే చూడాలి" అంటూ కళ్లనీళ్లు పెట్టుకున్న దాక్షా కదలాడింది.

"పిచ్చిదానా! నీ కేమీ కాదు. హాయిగా తిరిగి వస్తావు! పిచ్చి పిచ్చి ఆలోచనలతో మనసు పాడుచేసుకోకు. నువ్విలా మాట్లాడితే శ్రీధరం బెంబేలు పడిపోతాడు. రమా చిన్నపిల్లే! వాళ్లని కంగారు పెట్టకు" అంటూ తనకు వీడ్కోలు చెప్పాను నేను.

నిజంగానే ఇంతలో వెళ్లిపోతుం దని ఎలా అనుకుంటాను? కళ్లలో నుంచి నీళ్లు బొటబొటా రాలేసరికి తేరుకున్నాను. తలెత్తి చూస్తే రామం లేడు.

శ్రీవారు కూడా అప్పుడే తేరుకున్నట్లున్నారు. "గబగబా పని పూర్తి చేసుకో! అప్పుడే ప దవుతోంది, ఇంకో గంటలో వెళ్లాలి" అంటూ లేచి తన గదిలోకి వెళ్లారు.

పని చేసుకుంటూ మనిషిని అక్కడే ఉన్నాను కానీ, మనస్సు మాత్రం ఎప్పుడో గతంలోకి వెళ్లిపోయింది.


** ** **

దాక్షాయణీ, నేనూ చిన్నప్పటి నుంచీ స్నేహితులం. పెదపాడులో మా ఇద్దరి ఇళ్లూ పక్కపక్కనే ఉండేవి. ఇద్దరం - ఎప్పుడూ ఉంటే వాళ్లింట్లోనే, లేకపోతే మా ఇంట్లోనే కలిసే ఉండేవాళ్లం కానీ విడివిడిగా ఉండేవాళ్లం కాదు. త నిక్కడ ఉంటే, మా అమ్మ నాతోపాటు తనకీ జడలు వేసి, పూలు పెట్టి, అన్నం పెట్టి చేసేది. నేను వాళ్లింట్లో ఉంటే వాళ్లమ్మగారే అవన్నీ నాకూ తనతోపాటు చేసేవారు. మా అమ్మకి నే నొక్కదాన్నే; కానీ దాక్షాయణికి ఓ అన్నయ్య ఉన్నాడు. బడికి వెళ్లటం, చదువుకోవటం ముగ్గురం కలిసే చేస్తూ ఉండేవాళ్లం. దాక్షా, నేనూ ఆరో తరగతి చదివేవాళ్లం, వా ళ్లన్నయ్య ఎనిమిది చదివేవాడు. సరిగ్గా అపుడే దాక్షా పెద్దదైం దని చదువు మానిపించేశారు వాళ్ల వాళ్లు. నాతో ఆటలకి వచ్చేది కాదు ఇక. నిన్నటి వరకూ నా కూడా ఉన్న తను ఓణీ వేసుకుని ఆరిందలాగా వాళ్ల అమ్మగారితో, బామ్మ గారితో కలసి పనులు

చేస్తూంటే నాకు వింతగా ఉండేది. రోజూ కాస్సేపు వచ్చి నాతో కబుర్లు చెప్పటం మాత్రం మానలేదు తను.

మరో ఏడాదికి నా చదువూ ఆగిపోయింది.

అమ్మతో కలిసి పనులు చేయటం, ఏవో కుట్లూ, అల్లికలూ నేర్చుకుని చేస్తూ ఉండటం, తీరిక సమయాల్లో రామాయణం, భారతం. భాగవతం ఏవో ఒకటి చదివి తెలుసుకుంటూ ఉండటం వీటితో కాలం గడిచిపోయేది.



దాక్షకి సంబంధాలు చూడటం మొదలు పెట్టారు. ఏడాది తిరిగేసరికి ఒక సంబంధం కుదిరిందని, మాఘ మాసంలో ముహూర్తం పెట్టుకున్నారని తెలిసింది.

పెళ్ళినాటికి దాక్షకి పదిహేనేళ్ళు. అప్పట్లో తను ఎంత అందంగా ఉండేదో! సన్నగా, పొడుగ్గా, నాజూగ్గా బారెడు జడతో చూడగానే ఆకట్టుకునేలా ఉండేది. పచ్చటి మనిషేమో - ఎర్రటి కుంకుమ బొట్టూ, నల్లటి కళ్ళకి కాటుకా, ఎర్ర రాయి ముక్కుపుడకా, ఎర్రటి పెదాలూ తన ముఖంలో కళకళలాడుతూ కనిపించేవి! చేతినిండా ఉన్న గాజులూ, కాళ్ళకున్న పాంజేబులూ, సన్నజాజి పూల పరిమళం - తను అంతదూరాన ఉండగానే తను వస్తున్నట్లు తెలియజేసేవి.

తను పెళ్ళయి వెళ్ళిపోతుందని తెలియగానే, నేను బావురు మని ఏడుస్తుంటే మా అమ్మ కేకలేసింది నన్ను - "రేపు నీ పెళ్ళయితే నువ్వు మాత్రం వెళ్ళవా!" అంటూ.

ఎందుకో తెలియదు గానీ, పెళ్ళి ముహూర్తం నిర్ణయించినది మొదలూ, ఎప్పుడూ దిగులుగా, ఏదో పోగొట్టుకున్న దానిలా, అయిపోయింది దాక్ష! ఏదో తెలియని ఆవేదన తనను కాల్చేస్తున్నట్లుగా అసహనంగా అటూ ఇటూ

# దాక్షాయణి

కొంపెల్ల లక్ష్మీ సమీరజ


ఆగస్టు నెల
'కథా ప్రభ'లో
దాసరి అమరేంద్ర
రచన
'బ్రతకనేర్వనివాడు'

తిరుగుతూ ఉండేది. మామూలుగా మా ఇంటికి వచ్చేది. మౌనంగా కాసేపు కూర్చునేది. నే నేమైనా మాట్లాడినా, 'ఉఁ' అని కూడా అనేది కాదు. అసలు వినేదా అని నాకు అనుమానమే. అంతలోనే ఏదో గుర్తొచ్చినట్లుగా లేచి వెళ్లిపోయేది. ఏమిటంటే సమాధానం చెప్పేది కాదు. మా అమ్మ దగ్గర చెప్పి నేను బాధ పడితే, "పెళ్లి కుదరగానే అలాగే ఉంటుందిలే!" అని తేలికగా తీసేసింది.

అనుకున్న ముహూర్తం రానే వచ్చింది. మగపెళ్లివారు వచ్చి విడిదిలో దిగారు. పెళ్లికొడుకుని, చూద్దామని అందరితో వెళ్లిన నాకు, అక్కడ పదిమందితో కలిసి పేకాడుతూ, సిగరెట్ తాగుతున్న అబ్బాయిని 'అతడే పెళ్లి కొడుకు' అంటూ చూపించారు. ఎందుకో అతడిని చూడగానే వెగటుగా అనిపించింది. 'దాక్షా పెళ్లాడేది అతడిని' అన్న మాట నాకంత రుచించలేదు. 'ఇందుకే నేమో దాక్షా ముభావంగా ఉంటోంది' అనుకున్నాను. 'అసలు వాళ్ల పెద్దవాళ్ల కెలా నచ్చాడో' అనుమానం కలిగింది.

"పిల్లాడు బంగారంలా ఉన్నాడు. లంకాపుర మంత ఆస్తి ఉంది. ఒక్కడే కొడుకు. గుణాని కేముంది? మన పిల్ల తెలివైనది - ఆ మాత్రం అతడిని మార్చుకోలేదా!" - పెద్ద వాళ్లంతా అనుకుంటుంటే విన్నాను. 'అంటే ఆస్తి చూసి, అతడి గురించి తెలిసి కూడా దాక్షని అతడి కప్పగిస్తున్నారా?' - బాధనిపించింది నాకు.

అప్పగింతల సమయంలో అందరూ కళ్లనీళ్లు పెట్టుకున్నారు కానీ దాక్షా మాత్రం రాయిలా కూర్చుంది.

వెళ్లిపోయే ముందు మాత్రం నా దగ్గర కొచ్చి, "నా జీవితానికి, ఇక ఎన్నటికీ ఆలంబన నీ స్నేహమే వసుధా! ఉత్తరాలు రాస్తూంటావు కదూ!" - నా చేయి తన చేతిలోకి తీసుకుని మెత్తగా నొక్కుతూ అంది.

బాధతో నా గొంతు పూడిపోయింది. 'సరే' నన్నట్లు తల ఊపాను.

అలా వెళ్లిన దాక్షా దాదాపు ఏడాది దాటాక నా పెళ్లికి వచ్చింది మళ్లీ. అసలు నేనే గుర్తించలేనంతగా మారిపోయింది. తను, ఉత్తరాలలో బాగానే ఉన్నా నని రాస్తుంటే నిజమే నని నమ్మి మోసపోయానన్న సంగతి తనను చూడగానే అర్థమయింది.




మనిషి బాగా ఎండిపోయింది. ముఖంలో కాంతి, కళ్లలో కళ బాగా తగ్గిపోయాయి. నిరాశ, నిస్పృహ కబళించివేశాయి తనని. ఏదో 'బతకాలి కనుక బ్రతుకుతున్నా' నన్నట్లుగా అనిపించింది తనను చూడగానే. వచ్చింది మొదలూ నాతోనే ఉంది. ఆరిందలాగా నా పనులన్నీ తనే చూసింది. పూల జడ కుట్టడం దగ్గరనుంచీ, కళ్యాణ తిలకం దిద్దటం వరకూ అన్నీ తనే చేసింది. పెళ్లయిన మరుక్షణం బయలుదేరి వెళ్లిపోయింది. అందరం ఆశ్చర్యపోయాం.

నేను శ్రీవారితోపాటు ఉద్యోగ రీత్యా ఆయన ఉండే ఊరు వచ్చాను. దాదాపు ఆరేడు నెలల తరువాత తన కొక బాబు పుట్టిన సంగతి ఉత్తరంలో రాసింది. అంతవరకూ నా కా విషయం తెలియజేయకపోవటం ఒక వింత అయితే - కనీసం పురిటికి కూడా పుట్టింటికి వెళ్లకపోవటం మరొక వింతల్లే అనిపించింది నాకు.

బాబు పుట్టిన నెల రోజుల కనుకుంటాను - చాలా పెద్ద ఉత్తరం రాసింది నాకు.

"వసుధా!

"అమ్మా నాన్నలకి వాళ్ల పెంపకంలో పెరిగిన బిడ్డగా నా మీద నమ్మకం ఉండటం తప్పు కాదు కానీ, అన్ని రకాల వ్యసనాలకీ అలవాటు పడిన వ్యక్తిని నా భర్తగా చేసి 'అతడిని మార్చుకోగల వన్న నమ్మకం మాకు ఉంది' అని, కేవలం ఆస్తి, డబ్బు మాత్రమే జీవితంలో ప్రధానం అన్నట్లుగా చెప్పినప్పుడు నే నేమీ మాట్లాడలేకపోయాను.

"అంతవరకూ అమ్మా వాళ్ల ఆప్యాయతా, నీ స్నేహం తప్ప మరొకటి ఎరుగని నేను, ఈ ఇంటికి వచ్చి - ప్రపంచంలో ఈ రకపు మనుష్యులు కూడా ఉంటారా అని ఆశ్చర్యపోయాను. మా అత్తగారికి ఒక్కగా నొక్క కొడుకని ఈయన అంటే చాలా గారాబం. ఆ గారాబమే తనలో వ్యసనాలను పెంచింది. తనను మార్చాలని నేను ప్రయత్నించిన ప్రతిసారీ, 'మగవాడన్నాక ఆ మాత్రం ఉండదూ. ఆడదానివి నువ్వే సర్దుకోవాలి' అంటూ ఆవిడ అడ్డుపడటంతో తనకు అడ్డూ అదుపూ లేకుండా పోయింది. వా ళ్లిద్దరి మధ్యా బలిపశువు నయిపోయాను. అమ్మా వాళ్ల దగ్గర కెళ్లిపోవా లనిపించినప్పుడల్లా 'అతడిని మార్చుకోగలవన్న నమ్మకం మాకు ఉంది' అన్న మాట గుర్తొచ్చేది. 'నీ కష్ట మేదో నీవే అనుభవించు' అని వాళ్లు చెప్పారా అనిపించేది. అందుకే వెళ్లేదాన్ని కాదు.

"తను కొట్టినా పడ్డాను, తన్నినా పడ్డాను, సిగరెట్లతో కాల్చినా పడ్డాను. అత్తగారు చీపురుతో కొట్టినా సహించాను. అన్నం పెట్టకపోయినా బాధ పడలేదు. నోటికి వచ్చినట్లు ఇద్దరూ తిట్టినా మాట్లాడలేదు. కానీ, నేను అమ్మను కాబోతున్నా నని తెలిసిన క్షణం - నాకు ఆ ఆనందం కూడా దక్కకూడ దని వాళ్లు నన్ను నరకయాతనకు గురిచేస్తుంటే అప్పుడు ... అప్పుడు వచ్చింది, వసుధా, నాకు ధైర్యం. మా మామగారికి అన్ని విషయాలూ చెప్పి, నేను ఆ ఇంట్లో ఇక ఉండలేనని చెబుతుంటే - బహుశా మా నాన్నగారు కూడా నా గురించి అంత బాధపడుతున్నారో, లేదో - ఆయన మాత్రం "ఆడపిల్లలు లేని మా ఇంటికి లక్ష్మిలా వచ్చావు తల్లీ! నీ కన్నీరు మాకు ఎన్నడూ శుభం కాదు. రేపటి మా వంశవారసుడికి జన్మ నివ్వబోతున్న నా తల్లివి నువ్వు. నీ కే కష్టం రాకుండా నేను చూసుకుంటాను" అని నన్ను ఓదార్చి బాబు పుట్టేవరకూ నన్ను కంటికి రెప్పలా చూసుకున్నారు.

"ఇప్పుడు తన ఆస్తిలో మూడువంతుల వాటా నా పేర, నా తరువాత బాబుకు చెందేలా రాసి, నాకు పట్నంలో ఒక ఇల్లు కొనిచ్చి అక్కడకు తీసుకు వెళ్తున్నారు. ఆయన కన్నతండ్రికన్నా ఎక్కువగా నన్ను కడుపులో పెట్టుకుని చూసుకున్న దానికి వాళ్లు ఇస్తున్న ప్రతిఫలం ఏమిటో తెలుసా - 'నాకూ, ఆయనకూ ఏదో సంబంధం ఉందనీ, నా బాబు ఆయన బిడ్డనీ' ప్రచారం చేస్తున్నారు. ఛ! ఎంత నీచులో కదూ! ఆయన ఆ మాటలు ఏ మాత్రం పట్టించుకోవటంలేదు. నాకు మాత్రం ఒక్కటే మాట చెప్పారు.

"ఇంతకాలం ఆకుచాటు పిందెలా ఉన్నదానివి, తల్లీ! అభం శుభం తెలియకుండా ఉంటే లోకంలో బ్రతకటం కష్టం. రేపు నేను ఉండచ్చు, ఉండకపోవచ్చు. అప్పుడు మళ్లీ నీ దగ్గర ఉన్న ఆస్తి కోసం వాళ్లు మంచిగా మారామని నాటకం ఆడి నిన్ను మోసం చేయవచ్చు. గట్టిగా ఉండటం నేర్చుకో. లోకం మాటలు లక్ష్యపెట్టకు. బాబుకు నీ సంస్కారం నేర్పి పెంచు. నువ్వు ఆ పని చేయగలవని గట్టి నమ్మకం ఉంది నాకు. ధైర్యం, ఆత్మ విశ్వాసం - ఈ రెండే నీకు తోడు ఇక. వాటిని ఎట్టి పరిస్థితిలోనూ విడిచిపెట్టకు" అని ఆయన చెపుతుంటే కళ్లనీళ్లతో రెండు చేతులూ జోడించి ఆయనకు దణ్ణం పెట్టటం తప్ప మ రేమీ మాట్లాడలేకపోయాను.

"ఇక్కడకు వచ్చి వారం రోజులయింది. మొదట్లో చాలా ఒంటరిగా అనిపించి దిగులుగా ఉండేది. దానికితోడు పరిచయం, పలకరింపు పేరుతో వచ్చిన చుట్టుపక్కల వాళ్ల మాటలు సూదుల్లా గుచ్చుకుంటే భరించలేకపోయేదాన్ని తరువాత నాకు నేనే సర్దిచెప్పుకున్నాను. బాబు ఉండగా ఒంటరిదా న్నెలా అవుతాను చెప్పు? ఇన్ని సంవత్సరాల నరకం తరువాత నా కీ జీవితం చాలా ప్రశాంతంగా ఉంది. బయటవాళ్ల మాటలు

వింటుంటే వాళ్ల నంకుచితత్వానికి జా లనిపిస్తోంది ఇప్పుడు. భగవంతుణ్ణి తోడుగా చేసుకున్నాను. ఇనాళ్లూ వాళ్ల పట్ల నాలో పెరిగిన శత్రుత్వం కూడా వేళ్లతో నహా కూలిపోయింది. ఇకనుంచి నా కొత్త ఎడ్రస్‌కే ఉత్తరాలు రాస్తూ ఉండు."

అంటూ దాక్షా రాసిన ఆ ఉత్తరం చదువుతుంటే కన్నీళ్లు వరదలై వచ్చేశాయి నాకు. ఎంతసేపో ఏడుస్తూ ఉండిపోయాను. ఆఫీను నుంచి వచ్చిన మా వారు ఆ ఉత్తరం చదివి, నన్ను చూసి, "తను అంత ధైర్యంగా ఉత్తరం రాస్తే తనను అభినందిస్తూ జవాబు ఇవ్వవలసింది పోయి ను వ్విలా బేలగా అయిపోయావా!" అంటూ మందలించారు.

"జవాబు ఇవ్వటం కాదు. దాక్షాని ఒకసారి చూసిరావాలని ఉంది." కన్నీళ్లు తుడుచుకుంటూ చెప్పాను.

ఆఫీనుకు రెండు రోజులు సెలవు పెట్టి నన్ను తీనుకెళ్లా రాయన. ఎడ్రను వెతుక్కుంటూ వా ళ్లింటికి వెళ్లేనరికి మధ్యాహ్నం రెండు గంటలయింది. "తనూ నీలాగే చిన్నపిల్ల. కొత్త ఊరు, ఒక్కత్తీ ఉండటం కొత్త. వెళ్లి తనని ఇబ్బంది పెట్టడం నాకు ఇష్టం లే" దని ఆయన అనడంతో హెూటల్‌లో భోజనం చేసి, స్వీట్సూ, హాటూ త లో కేజీ పొట్లాలు కట్టించుకుని, అరటిపళ్లు కొని పట్టుకునివెళ్లి తలుపు కొట్టాము.

తలుపు తీసిన దాక్షా కళ్లల్లో నన్ను చూడగానే మెరిసిన కాంతి నే నిప్పటికీ మరచిపోలేదు. "వసుధా!" అంటూ నన్ను గట్టిగా తన గుండెలకు హత్తుకుంది. నన్ను తన కోసం తీనుకువచ్చినందుకు ఆయనకు ఎన్నిసార్లో కృతజ్ఞతలు చెప్పుకుంది.

తను భోజనాల ఏర్పాట్లు చేస్తుంటే 'వద్ద'ని వారించి, మేము తీనుకెళ్లినవి తన చేతిలో పెడుతూ -

"మరోలా అనుకోకు, దాక్షా! నీ ఉత్తరం చూడగానే ఆగలేక రావాలనిపించి వచ్చేశాను. నువ్వూ ఈ ఊరికి కొత్త. ఒంటరి జీవితమూ కొత్త. ఇప్పుడు వచ్చి నీకు ఇబ్బంది కలగజేయటమే! నీకు కాస్త అలవాటయ్యాక నువ్వే వద్దు తల్లీ! అన్నా మీ ఇంటికి భోజనాలకి వస్తూనే ఉంటాము. ఈసారికి ఏమీ అనుకోవద్దు." చెప్పాను తన చేతులు పుచ్చుకుని.

ఆ మాట వినగానే నా రెండు చేతులలో తన ముఖం దాచుకుని ఏడ్చేసింది పసిపిల్లలా.

"నువ్వు ఎప్పుడూ ఒంటరిదానివి కాదమ్మా! నీకు మే మెప్పుడూ తోడుంటాము. మీ అన్నయ్య ఎలాగో, అలాగే నన్నూ అనుకో!" ఆయన చెపుతుంటే వెక్కుతూ చెప్పింది తను -

"నీకు ఉత్తరం రాసినప్పుడే అమ్మావాళ్లకీ ఉత్తరం రాశాను, వసుధా! అన్నయ్య వచ్చాడు. తనని చూడగానే బాధ ఆపుకోలేక ఏడ్చేస్తే త నేమన్నాడో తెలుసా! 'మీ మామగారు ఆస్తంతా నీ పేరే రాశారుగా! ఇంకా ఏడుపు దేనికి?' అని అడిగాడు. తన కేదో అవసరానికి డబ్బు కావాలని అడిగాడు. అమ్మా నాన్నా రా లే దేమని అడిగాను. ఏకంగా వాళ్లను తీనుకునివచ్చి ఇక్కడే ఉంటామని చెప్పాడు. నా కెంత కోప మొచ్చిందో తెలుసా, వసుధా! తోడబుట్టినదాన్ని అంత కష్టపడ్డా నన్న బాధ కూడా లేకుండా ఆస్తి కోసం వచ్చాడు. వచ్చి ఇక్కడ ఉంటా నంటున్నాడు. పైగా 'ఆడపిల్లవి! ఒంటరిగా ఉండటం కష్టం. తోడు కావాలి కదా!' అని నా కోసం వస్తున్నట్లు నాటకం. ఏ మనుకుంటే అనుకుంటా డని గట్టిగా చెప్పేశాను - 'నా కోసం ర్రా నవసరంలేదు. నేను ఒంటరిగా ఉండగలను. అప్పుడప్పుడు మా మామగారు వచ్చి చూసి వెళ్తూ ఉంటారు. నా పేర రాశారు కదా అని ఆస్తి నా దనుకోకు. ఆయనదే! ఆయన ఎలా చేయమంటే అలా చేస్తాను. డబ్బు కోసం నా దగ్గరకు రానక్కర్లేదు" అని.


"నే నలా చెప్పేనరికి కోపం వచ్చింది తనకి. "ఊళ్లో అందరూ అనుకుంటుంటే ఏమిటో అనుకున్నాను. మీ మామగారి గురించి, నీ గురించీ నేను విన్నది నిజమే నన్నమాట" అంటూ వెళ్లిపోయాడు. తోడబుట్టిన అన్నగారే అలా అనేనరికి చచ్చిపోవా లనిపించింది, వసూ!" అంటూ కళ్లనీళ్లతో తను చెపుతుంటే -

"నీ మంచితనం ఎక్కడికి పోదు, దాక్షా! అనుకునేవాళ్లు లక్ష అనుకుంటారు. అనుకోనీ! నీ మనస్సాక్షి నీకు ప్రధానం. వాళ్లను లెక్కచేయకు. నీకు ఎప్పటికీ తోడుగా నే నున్నా నని మాత్రం మర్చిపోకు. నీకు రావా లనిపించినప్పుడల్లా మా ఇంటికి వస్తూ ఉండు. ఆయన చెప్పారు కదా - మీ అన్నయ్యలాంటివాడి నని! ఏ నంకోచం పెట్టుకోకు. మేము ఉన్నాం నీకు." తన తల నిమురుతూ చెప్పాను.

"బాబుకి 'శ్రీధరం' అని వాళ్ల మామగారు పేరు పెట్టినట్లు చెప్పింది మాటల సందర్భంలో. రెండు రోజులు తనతో గడిపి, తనకి ధైర్యం చెప్పి వచ్చేశాము.

అది మొదలు మేమూ వీలైనప్పుడల్లా తన దగ్గరకు వెళ్లివస్తూండేవాళ్లం. తనూ పిల్లాడిని తీనుకుని మాకు ఏ ఊరు బదిలీ అయినా వస్తూ ఉండేది.

శ్రీధరం పెరిగి పెద్దవా డయ్యేకొద్దీ దాక్షాకి కాస్త కాస్తగా ధైర్యం వచ్చింది. ఇంతలో వాళ్ల మామగారు పోయారు. ఆ పదిరోజులూ కోడలిగా అత్తవారింటికి వెళ్లి కర్తవ్యం నిర్వర్తించి వచ్చింది. తరువాత కలిసినప్పు డెప్పుడో చెప్పింది - భర్త వ్యసనాలకి ఆస్తి కర్పూరంలా హరించిపోతోందనీ, వేరే ఎవరితోనో పెళ్లి కాకుండానే కాపురం పెట్టాడనీ, ఆమెకీ ఇద్దరు పిల్లలనీ, ఇప్పుడు అత్తగారు నెత్తీ నోరూ మొత్తుకుని ఏడుస్తోందనీ, తనతో వస్తానని అడిగిందనీ, మామగారి మాట మేరకు తానే తీనుకురాలేదనీ చెప్పి, "అత్తగారి బాధ చూడలేకపోయాను. తీనుకురావా లనిపించింది కానీ, మామగారు పోయేముందు వా ళ్లిద్దరినీ చేరదీయ నని నా చేతిని తన తల మీద పెట్టి మరీ ప్రమాణం చేయించుకున్నారు. పోన్లే ఆయన పోనే పోయారు. ఆస్తి వాళ్లది. ఆవిడ బాధపడుతోంది కదా అని మెత్తబడ్డాను, వసుధా! ఆవిడ నైజ గుణం పోలేదు. 'ఉన్న ఆస్తి కరిగిపోయి అప్పులపా లవుతున్నాడు పావం,




వాడు! చేసింది తప్పని బాధపడుతున్నాడు. ఏదో ఆయన పొరపాటుగా రాశారు. ఆస్తి అనలు వాడికి చెందాల్సిందే కదా! రాసేయమ్మా వాడి పేర' అంది. అంతే! ఆవిడ నాతో ఎందుకు వస్తా నంటోందో, అర్థమయిపోయింది. పోనీలే అని తీనుకు వెళ్తే రోజూ ఆ విషయానికి గొడవచేస్తుంది. మంచో, చెడో మామయ్యగారు ఒక పని చేసి, ఒక మాట తీనుకున్నారు. ఇక అది మార్చే ప్రనక్తి లేదని నిర్ణయించుకున్నాను" అంది. తన ఆలోచన నరైనదే ననిపించింది నాకు.

వాళ్లన్నయ్య పెళ్లయింది. బయటవాళ్లకు వేసినట్లు ఒక కార్డు వేసి ఊరుకున్నారు. దాక్షా కూడా మొక్కుబడిగా ఆ ముహూర్తం నమయానికి వెళ్లి వచ్చేసింది.

అప్పుడు చెప్పింది - తన దగ్గరకు వచ్చి వెళ్లాక అన్నగారు తల్లికీ, తండ్రికీ ఉన్నవీ లేనివీ ఏవేవో చెప్పి, తన పట్ల వాళ్ల మనను విరిచేశాడనీ, అన్ని నంవత్సరాల తరువాత వాళ్లను చూడటానికే తను ఆ పెళ్లికి వెళ్తే, ఏదో ముక్తనరిగా మాట్లాడి ఊరుకున్నారనీ, మనవణ్ణి చూసి కూడా పెద్దగా ఉత్సాహపడలేదనీ చెప్పి బాధపడింది. డబ్బు వల్ల బంధుత్వాలు తెగిపోవడ


మంటే ఏమిటో అర్థమయింది నాకు. దాక్షా వాళ్ల బిడ్డ! తన మనను ఆ మాత్రం తెలియదూ వాళ్లకి. 'కనీనం తల్లైనా కన్న కూతురు అంత కష్టపడింది - ఏ తోడూ లేక ఒంటటరిగా ఉంటోంది. డబ్బు దేముంది, పిల్ల జీవితం ముఖ్యం కానీ అనుకోలేకపోయింది' అనిపించింది.

నేను మా ఊరు వెళ్లినప్పుడు మాత్రం దాక్షా గురించి తప్ప, మిగిలిన అన్ని విషయాల్లోనూ మామూలుగానే ఉన్నారు వాళ్లు. తన విషయం వాళ్లూ మాట్లాడరు, నేనూ మాట్లాడను. మా అమ్మా వాళ్లతో మాత్రం తన పరిస్థితి అంతా చెపుతూ ఉంటాను.

దాక్షా వాళ్లన్నయ్యకి తను ఉన్న కాలేజీలో లెక్చరర్ ఉద్యోగం రావటం, వాళ్ల అమ్మా నాన్నలతో సహా ఆ ఊరు వచ్చి అద్దె ఇంట్లో మకాం పెట్టడం జరిగిపోయాయి. వాళ్ల మామగారు పోయిన తరువాత రెండు వాటాలుగా ఇంటిని అద్దె కిచ్చి ఒక వాటాలో తను శ్రీధరంతో ఉండేది దాక్షా. దాంతో 'పెద్ద ఇంట్లో అన్నగారిని కూడా రానీయకుండా ఒక్కతే ఉంటోంద'న్న మాట రాలేదు అంతగా.

అన్నగారు, తల్లీ తండ్రీ ఊళ్లోనే ఉన్నా రాకపోకలు మాత్రం లేవు. శ్రీధరం డిగ్రీ చదువు కొచ్చేనరికి దాక్షా వాళ్ల అమ్మగారు, నాన్నగారు ఇద్దరూ పోయారు. కబురు వస్తే ఆ నమయానికి వెళ్లి వచ్చేసింది రెండుసార్లూ కూడా. అన్నగారికి నలుగురు పిల్లలు పుట్టినా అలాగే చేసింది.

ఒకసారి నేను వాళ్లింటికి వెళ్లేనరికి ఒక నడివయను మనిషి కుర్చీలో కూర్చుని సిగరెట్ కాలుస్తూ కనిపించాడు. నన్ను చూసి కూడా అతడిలో చలనం కనిపించలేదు. "దాక్షా!" పిలుస్తూ తలుపు గొళ్లెం కొట్టాను. చీర చెంగుకి చేతులు తుడుచుకుంటూ వచ్చిన దాక్షా అతడిని చూడగానే




చటుక్కున ఆగిపోయింది ఒక్క క్షణం. వెంటనే గబగబా నా చేయి పట్టుకుని వంట గదిలోకి తీసుకెళ్లి, పీట వేసి, కూర్చోబెట్టి నా పక్కనే కూర్చుని, తప్పు చేసిన దానిలా తల దించుకుంటూ అంది -

"నా జీవితంలో నీ దగ్గర దాచిన మాట ఇ దొక్కటే, వసూ!"

త నెందుకలా అందో నా కర్థం కాలేదు.

"మా మామగారు పోయిన తరువాత రెణ్ణాల్ల కనుకుంటాను - తను వచ్చారు. మా అత్తగారిని తీసుకురావటానికి ఆలోచించిన నేను తను వచ్చేనరికి ఏం చేయాలో తెలియలేదు. నిశ్చేష్టనై గుమ్మంలోనే నిల్చున్నాను తనను చూస్తూ తలుపు పట్టుకుని. "అన్నం తిని నాలుగురోజు లయింది, అన్నం పెడతావా?" తల దించుకుని అడిగారు. ఎందుకో చెప్పలేను, వసుధా! చాలా బాధనిపించింది. లోపలికి రమ్మని, అన్నం పెట్టాను. తినేసి వెళ్లిపోయారు. ఏమీ మాట్లాడలేదు - తనూ, నేనూ కూడా. అప్పటినుంచీ ఎప్పుడైనా వచ్చి అన్నం తింటా నని అడిగి, తిని వెళ్లిపోతా రు. ఏమీ అడగరు, ఏమీ చెప్పరు. శ్రీధరం పెద్దవాడయ్యాక ఒకసారి వాడినే అడిగాను - 'అన్నం పెట్టమని తప్ప ఏమీ అడగటం లేదు కదా అని రానిస్తున్నాను. నీ కిష్టం లేకపోతే చెప్పేయ్, నాన్నా! ఆ నిష్ఠూరం నీ దాకా వద్దు. నేనే తెచ్చుకుంటాను' అని. వా డేమీ మాట్లాడలేదు. ఆ రోజు రాత్రి మాత్రం కుళ్లి కుళ్లి ఏడ్చాడు. రా వద్దని అనలేకపోతున్నాను, వసూ!" చెప్పింది.

"పిచ్చిదానా! ఆయన నీ భర్త. రమ్మనటానికైనా, వ ద్దనటానికైనా నీకు అధికారం ఉంది. తప్పు చేస్తున్నట్లు బాధ పడనక్కర్లేదు. పెద్దవా డయ్యాడు కదా అని శ్రీధరాన్ని తన అభిప్రాయం చెప్పమని అడిగావు. నువ్వు చేసింది తప్పు కాదు. కానీ వాణ్ణి నువ్వు అర్థం చేసుకోలేకపోయినందుకు ఏడ్చాడు వాడు" అన్నాను.

"వసుధా!" విస్మయంగా చూసింది నా వంక.

"అవును, దాక్షా! ఆయన రావటం వాడికి ఇష్టం లేకపోతే వాడే చెప్పేవాడు నీతో ఆ మాట. ఆ స్వతంత్రం వాడికి లేదూ! వాడికి 'నాన్న' రావటం ఇష్టం కనుకనే ఆ మాట చెప్పలేదు నీతో. అది నువ్వు అర్థం చేసుకోలేకపోయా వని ఏడ్చాడు." తన చేయి మెల్లగా నొక్కుతూ చెప్పాను.

మేము లేచి బయటకు వెళ్లేనరికి ఆయన వెళ్లిపోయారు. నేను ఊరు వెళ్లాక మా వారితో చెప్పాను జరిగిన విషయమంతా. "అందుకే స్త్రీని క్షమయా ధరిత్రీ అన్నారు" అన్నా రాయన చిన్నగా నవ్వుతూ.

శ్రీధరం డిగ్రీ ఫైనల్ ఇయర్ పరీక్షల ముందు ఉత్తరం వచ్చింది దాక్షా దగ్గర నుంచి. శ్రీధరానికి బ్యాంక్‌లో క్లర్క్‌గా ఉద్యోగం వచ్చిందనీ, ఉపనయనం చేయా లనుకుంటున్నా ననీ రాసింది.

ఆ ఉత్తరం చూసి నాకన్నా ఎక్కువగా ఆయన నంతోషించారు. "దాక్షా ఇంకొక మూడు నాలుగేళ్లు కష్టపడితే చాలు. ఇక కోడలు వచ్చి బాధ్యత తీసుకుంటుంది" అన్నారు ఆనందంగా.

నాకు నవ్వొచ్చింది త నలా అనేనరికి. ఆయనకు అక్కా చెల్లెళ్లు లేకపోవడంతో దాక్షా అంటే ఎంతో అభిమానం తనకి. తన ప్రతి ఉత్తరం చదివి, సలహా లిస్తూ నన్ను జవాబు రాయమంటారు.

ఒకరోజు హఠాత్తుగా శ్రీధరంతోపాటు వచ్చింది దాక్షా. "మా అబ్బాయి ఒడుగు. మీ రిద్దరూ వారం, పది రోజులు ముందుగా వచ్చి నాకు కాస్త సాయంగా నిలబడాలి." ఆనందంగా చెప్పింది - కార్డు ఆయన చేతికి అందిస్తూ.

"తప్పకుండా!" ఇద్దరం ఒక్కేసారి అన్నాం.

"ఎప్పుడు చేరుతున్నావ్ ఉద్యోగంలో" శ్రీధరాన్ని అడిగా రాయన.

వాళ్ల మాటల ధోరణిలో వాళ్లని వదిలేసి మే మిద్దరం లోపలకు నడిచాం.

"ముహూర్తం పెట్టగానే శ్రీధరాన్ని వాళ్ల నాన్నగారి దగ్గరకు పంపించాను - విషయం చెప్పి, ఆ నమయానికి రమ్మని పిలవమని. ఆయన ఏమీ మాట్లాడలేదట. మా అత్తగారు మాత్రం ఏవేవో మాట్లాడిందట. ఇన్నేళ్ల తరువాత మనవడు మొదటిసారిగా ఇంట్లో అడుగు పెట్టాడు కదా అన్న ఆప్యాయత కూడా లేకపోయింది. వాడి అదృష్టం అంతే! ఎవరం ఏమి చేయగలం?" బాధగా అంది.

మర్నాడు వెళ్లిపోయారు.

మేము వెళ్లేనరికి దాక్షా వాళ్ల అన్నగారు, వదినగారు, పిల్లలు నలుగురూ వరండాలో కబుర్లు చెప్పుకుంటూ కూర్చుని కనిపించారు. గేటు తీయబోతుంటే ఆయన నా చేయి పట్టుకుని ఆపేశారు. నే నాయన వంక చూసేనరికి - "ఒడుగుకి ఇప్పుడే వచ్చా మని చెప్పకు. వాళ్ల వాళ్లంత ఉండగా మనం ఇప్పుడే రావటం, ఉండటం ాగుండదు. ఏదో పని మీద వచ్చి చూడటానికి వచ్చాం, ముహూర్తం నాటికి మని చెప్పు" అన్నారు.

నరే నన్నట్లు తల ఊప

దాక్షా అ గారు మమ్మ ూడగానే వచ్చి ఆహ్వానించారు.

ఆయన నాకు చెప్పినట్లే అతడితో చెప్పారు.

నేను లోపలకు వెళ్లాను. నన్ను చూడగానే దాక్షా ముఖం వెలిగిపోయింది. "వచ్చావా, వసుధా!" ఆప్యాయంగా అంటూ నా చేతులు తన చేతుల్లోకి తీసుకుంది.

నేను ఒక్క క్షణ మాగి, ఆయన చెప్పమన్నట్లే చెప్పాను తనతో. వెంటనే తన ముఖం వాడిపోయింది.

"నాకు తెలుసు, వసూ, ను వ్వేందు కలా అంటున్నావో! నేను వాళ్లని పిలవలేదు. కబురు చేశా నంతే! వచ్చేశారు. శ్రీధరం ఉద్యోగస్తుడయ్యాడు కదా! ఇద్ద రాడపిల్లల్లో ఒకరిని వీడికి ఇవ్వాలని వాళ్ల ఉద్దేశ్యమేమో. లేకపోతే ఇన్నాళ్లూ రాని మనుమలు ఇప్పుడు హఠాత్తుగా ప్రేమతో ఎలా వచ్చేస్తారు అనుకున్నాను. వెళ్లిపొమ్మందా మనుకుని, శ్రీధరం మనసు నాకు తెలియదు - ఒకవేళ వాడికి ఆ పిల్లల నెవరినైనా చేసుకోవాలని ఉంటే నేను వెళ్ళమన్నా నన్న కోపంతో వాడు నాకు దూరమవుతాడు. ఏం చేయాలో తెలియక వాళ్లను వెళ్లమనలేదు." బేలగా చెప్పింది.

"దాక్షా! స్నేహితురాలిగా నువ్వు నన్ను అర్థం చేసుకున్నది ఇదేనా! నీ మనసు నాకు తెలియదూ! మేము మళ్లీ ముహూర్తం సమయానికి వస్తాం! నిజం! ఆయనే చెప్పమన్నా రీ మాట. బాధపడకు!" తన ముఖం నా రెండు చేతులతో పట్టుకుని చెప్పాను.

త నిచ్చిన కాఫీ తాగేసి బయలుదేరి వెనక్కి వచ్చేశాం.

ఒడుగు రోజుకి మేము మళ్లీ వెళ్లేసరికి దాక్షా భర్త కనిపించారు ముందుగా. క్రితం సారి నేను చూసినప్పటికంటె మనిషి బాగా పాడైపోయారు. దూరం నుంచే మా వారికి ఆయన గురించి చెప్పి, ఒక కుర్చీ వేసి ఈయనను కూర్చోమని, నేను లోపల కెళ్లాను. అప్పటికే ఏర్పాట్లన్నీ పూర్తయిపోయాయి. దాక్షాకి కనపడి, కాస్సేపు తనతో మాట్లాడి, ముహూర్తానికి శ్రీధరం మీద నాలుగు అక్షింతలు వేసి, దాక్షాకీ, ఆయనకీ బట్టలు పెట్టి, భోజనాలు చేసి సాయంత్రానికి వచ్చేశాము.

రెండు రోజుల తరువాత శ్రీధరాన్ని తీసుకొచ్చి మా ఇద్దరికీ బట్టలు పెట్టించి దణ్ణం పెట్టించింది దాక్షా. "ఎందుకీ చాదస్తమంతా, దాక్షా!" అంటే,

"నాకు మీరు తప్ప ఎవ రున్నారు?" అంది కళ్ళ నీళ్లు పెట్టుకుని. దాంతో ఇక ఏమీ మాట్లాడలేకపోయాం. "ఇదే మీకు నే నిస్తున్నది, మళ్లీ మరో మూడేళ్లయ్యాక పెళ్లి దాకా ఇంక ఏమీ లేనే లేదు" అంది కొడుకు వంక సంబరంగా చూసుకుంటూ.

వాళ్లు వెళ్లేటప్పుడు శ్రీధరాన్ని పిలిచి చెప్పారాయన - ఉద్యోగంలో చేరాక మొదటి జీతంతో వాళ్ల బామ్మకీ, అమ్మకీ, నాన్నకీ బట్టలు కొనిపెట్టమని. నవ్వుతూ తల ఊపాడు శ్రీధరం.

దాదాపు మూడు నాలు గేళ్లయ్యాక ఒకరోజు శ్రీధరం ఒక్కడూ వచ్చాడు. 'సంగతి ఏమిట'ని అడిగితే -

"అమ్మతో కలిసి చూసిన ఆమ్మాయి మా ఇద్దరికీ కూడా నచ్చింది, మామయ్యగారూ! అయితే నేను కొన్ని విషయాలు అదే ... అమ్మ గురించి తనతో ముందే మాట్లాడాలని అనుకుంటున్నాను. నే నలా మాట్లాడటం వల్ల అమ్మ తనకి లోకువవదు కదూ!" సలహా చెప్పమన్నట్లు అడిగాడు.

నాకు శ్రీధరాన్ని చూడగానే ముచ్చటగా అనిపించింది.

"డైరెక్ట్‌గా విషయం మాట్లాడకుండా ముందు మామూలుగా మాట్లాడి, ఆ అమ్మాయి స్వభావం తెలుసుకుని అప్పుడు చెప్పు!" తను చెప్పారు.

"సరే" నని వెళ్లిపోయాడు శ్రీధరం.

ఆ అమ్మాయితోటే శ్రీధరం పెళ్లి కుదిరింది.

పెళ్లికి వెళ్లి, అక్కడి పెళ్లి కూతుర్ని చూశాక 'శ్రీధరానికి తగిన పిల్ల' అనిపించింది. రమ ఇంకా డిగ్రీ చదువుకుంటోంది. తల్లి లేదు, పాపం. 'ఆ లోటు మా దాక్షా తీర్చగలదు' అనుకున్నాను. దాక్షాతో ఆ అమ్మాయి ఎంతగా కలిసిపోయిందో పెళ్లయిన నెల్లాళ్ల తరువాత వాళ్లింటికి వెళ్లిన నాకు అర్థమయింది. ఆ విషయంలో 'దాక్షా అదృష్టవంతురాలు' అనుకున్నాను. తల్లీ కూతుళ్లలా అనిపించా రిద్దరూను.

మాటల సందర్భంలో చెప్పింది దాక్షా - తనకి ఈ మధ్య బీ.పీ., షుగర్ - రెండూ కూడా కాస్త ఎక్కువగా కనిపిస్తున్నాయని.


వెంటనే అన్నాను - "శ్రీధరాన్ని చూసుకునేందుకు కోడలు వచ్చింది కదా! నువ్వు నాలుగు రోజులపాటు నా దగ్గరకు రారాదూ, కాస్త విశ్రాంతి తీసుకుందువుగాని" అని.

వెంటనే ఏడ్చేసింది దాక్షా.

"క్రితం జన్మలో నువ్వు మా అమ్మవయి ఉంటావు, వసూ! అందుకే అమ్మలా నన్ను ప్రతిసారీ, ప్రతి చిన్న విషయానికీ జాగ్రత్తగా చూసుకుంటున్నావు. నువ్వు రమ్మన్నందుకైనా వస్తాను" అంది.

శ్రీధరాన్ని రమనీ బలవంతంగా ఒప్పించి తీసుకెళ్లాను దాక్షాని.

నాతోపాటు రిక్షా దిగిన తనని చూసి, మా వారు చాలా సంతోషించారు. గట్టిగా వారం పదిరోజు లయిందో, లేదో వెళ్లిపోతా నంటూ కూర్చుంది. తనకు



తగ్గట్టే శ్రీధరం వచ్చేశాడు. ఇక ఉండనంటే ఉరంద నని పట్టుబట్టి వెళ్లిపోయింది.

ఏడాది తిరిగేసరికి దాక్షా 'బామ్మ'యిపోయింది. ఆ క్షణంలో తన ఆనందం చూస్తే కళ్లు చెమ్మగిల్లాయి నాకు. మరో మూడేళ్లలో ఇంకో ఇద్దరు మనవలు పుట్టారు.

శ్రీధరానికి ఆఫీసర్‌గా ప్రమోషన్ వచ్చి ఇంకో ఊరు బదిలీ చేశారు. శ్రీధరం, రమ ఇద్దరూ తమతో వచ్చేయమని పట్టుబట్టినా వెళ్లలేదు దాక్షా. చూడాలనిపించినప్పు డల్లా వెళ్లి చూసి వస్తూండేది.

ఒకరోజు రాత్రి వేళ దాదాపు పదకొండు గంటల ప్రాంతంలో ఎవరో తలుపు తడితే, తీసి చూస్తే ఎదురుగా శ్రీధరం! ముఖం బాగా పీక్కుపోయి ఉంది.

"లోపలకు రా!" శ్రీధరంతో చెప్పి, "మంచి నీళ్లు తీసుకురా!" నాతో అన్నారు మావారు.

నేను లోపల కెళ్లి మంచినీళ్లు తెచ్చేసరికి వీథి గుమ్మంలోనే మెట్ల మీద కూర్చుని, రెండు చేతులతో ముఖం కప్పుకుని ఏడుస్తున్నాడు శ్రీధరం. మా వారు నిస్తేజంగా గోడకు చేరబడి కూర్చుని ఉన్నారు.


"ఏం జరిగింది?" మా వారి పక్కన కూర్చుంటూ కంగారుగా అడిగాను.

"ఆయన పోయారట!" చెప్పా రాయన.

"ఎవరూ?" అని అడగలేదు నేను. కాస్సేపు ఆలోచించిన తరువాత అర్థమయి, శరీరంలో ఉన్న శక్తినంతా ఎవరో బలవంతంగా లాగేసిన ట్లనిపించింది. కూర్చున్నచోటే కూలబడిపోయాను.

"భగవంతుడు ఎందుకో నన్ను పరీక్షిస్తున్నాడు, వసుధా! కాస్త తెప్పరిల్లా నని తల ఎత్తేసరికి మరో దెబ్బ కొడుతున్నాడు." వాళ్ల మామగారు పోయినప్పుడు త నన్నమాట గుర్తొచ్చింది వెంటనే.

'నిజమే! బాధ్యత పూర్తయి హాయిగా ఊపిరి పీల్చుకుందే, లేదో - ఇప్పుడు ఈ ఉపద్రవం' అనుకున్నాను.




"పొద్దుట ఆఫీసుకు కబురొచ్చిం దత్తా! ఇంట్లో క్యాంప్ కెళ్తున్నా నని చెప్పి వెళ్లాను. నేను వెళ్లేసరికే దహన సంస్కారా లయిపోయాయి. ఇం కక్కడ ఉండబుద్ధవలేదు. ఒక సలహా తీసుకుందా మని మీ దగ్గర కొచ్చాను." చెప్పాడు శ్రీధరం కాస్త తెప్పరిల్లాక.

మే మేమీ మాట్లాడక ముందే తనే చెప్పటం మొదలుపెట్టాడు.

"ఆయనను చేసుకుని అమ్మ సుఖపడినది లేదు ఈ క్షణం వరకూ. నలుగురిచేతా లోకువగా మాట లనిపించుకుంటూ కూడా ఆయన వస్తే అన్నం పెట్టి పంపేది తప్ప ఏనాడూ ఒక్క పరుష వాక్యం మాట్లాడలే దాయన గురించి. ఒకసారి న న్నడిగిం దత్తా! 'అన్నం పెట్టమని తప్ప ఏమీ అడగటం లేదు కదా అని రానిస్తున్నాను, నాన్నా! నీ కిష్టమేనా ఆయన రావటం? ఇష్టం లేకపోతే చెప్పేయ్! రా వద్దని చెప్పేస్తాను' అని. అమ్మ అలా అడిగేసరికి చాలా బాధగా అనిపించింది నాకు. నాన్నగా కాదు, కనీసం ఒక మనిషిగా కూడా నే నాయనను గౌరవించలేదు ఈ క్షణందాకా. రావద్దని నేనే చెప్పేద్దా మని కూడా అనుకున్నాను చాలాసార్లు. కానీ అమ్మ మీద గౌరవంతో అనలేకపోయాను.

"అమ్మది చాలా మంచి మన సత్తా! త నెంత బాధపడినా, ఎదుటి వ్యక్తి బాధపడకూడ దనుకుంటుంది. తను ఏ ఉద్దేశంతో ఆయనకు అన్నం పెడుతోందో నాకు తెలుసు. అటువంటప్పుడు 'వద్దమ్మా రావద్దని చెప్పు' అని ఎలా అనగలను? నే నామాట అనగానే తను ఆయనతో చెప్పేస్తుంది అదే మాట. కానీ తన మనస్సెంత బాధపడుతుందో నాకు తెలుసు. అందుకే ఏమీ మాట్లాడకుండా ఉండిపోయాను. 'తన మాట కా దంటానని ఎలా అనుకుంది అమ్మ' అని మాత్రం చాలా బాధపడ్డాను.

"నా కాయనను 'నాన్న' అనటం ఇష్టం లేదు కదా అని, ఇప్పుడు వెళ్లి, 'అమ్మా ఇన్నాళ్లూ నువ్వు అన్నం పెడితే తిని వెళ్లిన వ్యక్తి మరణించాడు' అని తేలికగా చెప్పేసే విషయం కాదు ఇది. ఇన్నాళ్లూ పెద్ద మనసుతో తనను ఆదరించి అన్నం పెట్టిన మనిషికి వైధవ్యం కానుకగా ఇచ్చి వెళ్లా డాయన. నా నోటితో నే నామాట అమ్మకి చెప్పలే నత్తా! నిజం నాలోనే సమాధి చేసుకోవా లనుకుంటున్నాను. మీ రేమంటారో నని ..." ముఖం తుడుచుకుంటూ చెప్పి, ఒక్క క్షణం మా ఇద్దరివంకా చూస్తూ ఆగాడు.

"నువ్వు చెప్పిన దంతా నిజమే నయ్యా!" మా వా రన్నారు వెంటనే.

"కానీ ఇది అంత తేలికగా దాగే విషయం కాదు. రేపు ఏదో ఒక రూపంలో ఎవరో ఒకరి ద్వారానైనా బయటపడకపోదు. అటువంటప్పుడు అమ్మకు ను వ్వేమని జవాబు చెప్తావు, చెప్పు!"

"నిజమే, మామయ్యా!" మా వారి మాటను మధ్యలోనే అందుకుని అన్నాడు శ్రీధరం.

"అందుకే, పద! మేమూ వస్తున్నాం. అమ్మ ఎక్కడుంది ఇప్పుడు?" అడిగారు తను.

"ఊళ్లోనే. ఒక్కత్తే ఉంది." చెప్పాడు. అంతే ఇల్లు ఎలా ఉన్న దలా వదిలేసి, ఉన్నవాళ్లం ఉన్నట్లుగా బయలుదేరాం శ్రీధరంతో.

మేము వెళ్లేసరికి దాక్షా వాళ్ల అన్నగారు, వదినగారు కనిపించారు ఇంట్లో. మేము ముగ్గురం ముఖాలు చూసుకున్నాం. దాక్షాకి విషయం మా నోటితోచెప్పనవసరం లేదని ముగ్గురికీ అర్థమయిపోయింది. లోపలకు రాలే నంటూ శ్రీధరం గేటు దగ్గర ఆగిపోతే, మా వారు తన భుజం చుట్టూ చేయి వేసి గట్టిగా పట్టుకుని లోపలకు నడిపించారు.

"కర్మకాండలు చేయవలసిన కొడుకువి, భయపడితే ఎలారా?" అంటూ ఎదురొచ్చాడు దాక్షా అన్నగారు.

అత డా మాట అనకుండా ఉంటే ఏమయ్యేదో. అలా అనటం మాత్రం నాకు చాలా అసహ్యంగా అనిపించింది. వాళ్ల నలా వదిలేసి, గబగబా లోపల కెళ్లాను దాక్షా కోసం.

లోపల ఒక గదిలో గోడకు ఆనుకుని కూర్చుని ఉంది దాక్షా.

"దాక్షా!" అంటూ తన దగ్గరకు వెళ్లాను.

"వసుధా!" అంటూ నా చేయి పట్టుకుని తనకు బాగా దగ్గరగా కూర్చోబెట్టుకుని, నా భుజం మీద తల వాలుస్తూ, "అన్నయ్య విషయం చెప్పాడు" అంది మెల్లగా.

నేను మౌనంగా తల నిమురుతుంటే - "ఏమిటో - పట్టు చీర కట్టుకుని, ఉన్న నగలన్నీ పెట్టుకుని, ఇంత బొట్టు, అంత పసుపుతో అలంకారం చేసుకుని మాయమైపోయిన ఆయన రూపాన్ని వెక్కిరించా లనిపించాలని కోరిక కలిగింది, వసుధా, ఆ మాట వినగానే." అదే స్వరంతో అంది.

"దాక్షా!" భయంగా అన్నాను.

"భయపడకు, వసూ! నా కేం కాలేదు. ఇన్నాళ్లూ బతుకుతూ, 'నువ్వు లేకపోయినా నేను బ్రకతగలను చూశావా' అని తనతో సవాలు చేసేదాన్ని మనసులో. ఇప్పుడు ... ఈ బ్రతు కిక వృథా కదూ! ఎవరి మీద సాగించాలి ఒంటరి పోరాటం? బ్రతికున్న ఆ ముసలమ్మ మీదా? రేపో, ఎల్లుండో ఆ ముసలి ప్రాణమూ పోతుంది. ఇప్పటికే సగం కాదు, ముప్పాతిక చచ్చి ఉంటుంది కొడుకుతోపాటే!" తను అదే పనిగా మాట్లాడుతుంటే, "దాక్షా!" అంటూ తల పట్టి పైకి ఎత్తాను.

"ఏడుస్తున్నా నేమో నని చూస్తున్నావా! పిచ్చి వసూ! పదిసార్లు పిలిచి అన్నం పెట్టినందుకే ఏడుపొస్తుం దనుకుంటున్నావా? నేను ఏడవను, వసూ!

నాకు ఏడుపు రాదు. ఊఁహు!" అంది తల అడ్డంగా తిప్పుతూ.

"శ్రీధరం!" కాస్త గట్టిగా పిలిచాను.

"శ్రీధరం వచ్చాడా!" ఆశ్చర్యంగా అంది దాక్షా.

"ఊఁ, మాతోనే వచ్చాడు." చెప్పాను తనను గట్టిగా పట్టుకుని.

"అత్తా!" అంటూ వచ్చిన శ్రీధరం ఒక్కసారి దాక్షాను చూసి గుమ్మం దగ్గర ఆగిపోయాడు.

"నీ గురించే అనుకుంటున్నాను, నాన్నా! ఎలా వస్తావా అని. ఈరోజు మామయ్యతో వెళ్లి బ్రాహ్మల్ని మాట్లాడుకుని, వెళ్లి రమనీ, పిల్లల్ని తీసుకుని రా! రేపు కర్మ ప్రారంభిద్దువుగాని." చెప్పింది దాక్షా. - "అలాగే బంధువు లందరికీ ఉత్తరాలు వ్రాయాలి."

తల ఊపాడు శ్రీధరం సరే నన్నట్టు. తన ముఖంలో ఏదో పెద్ద బరువు దిగినంత రిలీఫ్ కనిపించింది. ఒక్క క్షణం నిల్చుని వెళ్లిపోయాడు.

"ఏమిటి వసూ, అలా చూస్తున్నావు? దాక్షా ఇంత రాయి ఎలా అయిపోయిం దనా?" అడిగింది దాక్షా.

"లేదు, దాక్షా! నీ మనసు ఎంత బాధపడిందో, ఇన్నాళ్లూ ఎంత బాధ గుండెలో దాచుకుని తేలికగా తిరిగావో తెలిసి ఆశ్చర్యపోతున్నాను." చెప్పాను.

"నీకు తెలుసా, దాక్షా! శ్రీధరం నీ కీ విషయం చెప్పి, వైధవ్యం కానుకగా ఇవ్వటం ఇష్టం లేదన్నాడు." నేను చెవుతుంటే మధ్యలో అందుకుని -

"నిజమా, వసూ! శ్రీధరం అలా అన్నాడా?" ఎంతో సంబరంగా అడిగింది.

వెంటనే - "ఏ జన్మలో ఏ పాపం చేశానో ఈ జన్మలో ఆ కర్మ ఫలం అనుభవిస్తున్నాను ఈ క్షణం వరకూ. ఇంకా శ్రీధరాన్ని నొప్పించకూడ దని,ఆ పని చేస్తే నాకు కాదు ఆ ఫలితం వాడికి, పిల్లలకీ కూడా వెళ్తుందని నాకు భయం, వసూ! వద్దు. అన్నీ శాస్త్ర ప్రకారమే చేయాలి. తప్పదు" అంది స్థిరంగా.

మే మిద్దరం ఆ రోజు ఉండి, వెళ్లిపోయి పదో రోజుకి వచ్చాము మళ్లీ. ఆ రోజు అన్నీ శాస్త్రోక్తంగా చేయించింది దాక్షా. తరువాత కూడా గోదానం, భూదానం, సువర్ణదానం అంటూ అన్నీ చేయించింది.

ఆ తరువాత చుట్టా లంతా వెళ్లాక కూడా మామూలుగా ఉంది తప్ప ఒక కన్నీటి చుక్క రాల్చలేదు. శ్రీధరం రమ్మన్నా వెళ్లలేదు. "ఇప్పు డేం జరిగిందని ? అందరూ నా గురించి బెంబేలు పడిపోతున్నా" రంటూ గంభీరంగా ప్రశ్నించిన దాక్షాని చూసి అంతా ముక్కున వేలు వేసుకున్నారు ఆశ్చర్యం పట్టలేక.

ఇది జరిగి గట్టిగా ఏణ్ణర్థం కాలేదు పూర్తిగా.

ఈ ఏణ్ణర్థంలోనూ దాక్షాకి బీ.పీ, షుగర్‌తోపాటు హార్ట్ ఎన్‌లార్జ్‌మెంట్ కూడా వచ్చి చాలా ఇబ్బంది పడుతోంది. రెండు మూడు సార్లు శ్రీధరంతోపాటు వాళ్ల ఊరు వెళ్లి అయిదారు నెలలు ఉండి వచ్చింది. ఇంతలో మా వారికి రిటైర్‌మెంట్ దగ్గర పడటంతో దాక్షా ఉంటున్న ఊళ్లోనే తన ఇంటికి నాలుగు వీథుల అవతల ఒక చిన్న ఇల్లు కొనుక్కుని వచ్చేశాము. ఆయన క్రితం నెల్లోనే రిటైరైపోయారు. ఆయన రిటైరైన పదిహేను రోజులకి, దాక్షాకి బాగా నీరుపట్టి ఆయాసం వచ్చి అవస్థపడుతోం దని వాళ్ల ఇంట్లో అద్దెకి ఉంటున్న వాళ్ల అబ్బాయి రామం వచ్చి చెప్పేసరికి కంగారుపడ్డాను. అంతకి రెండు రోజుల ముందు మేము కలుసుకున్నప్పుడు బాగానే ఉంది.

నేను వాళ్లింటికి వెళ్లాను. ఆయన శ్రీధరానికి టెలిగ్రాం ఇచ్చి వచ్చారు. ఆ రాత్రికి వచ్చాడు శ్రీధరం. దాక్షాని బలవంతంగా ఒప్పించి మర్నాడు తీసుకువెళ్లిపోయాడు తనతో. అప్పుడే 'ఇక నన్ను చూడలేనం'టూ కళ్లనీళ్లు పెట్టుకుంది. అన్నట్టుగానే వెళ్లిపోయింది.

మే మిద్దరం వెళ్లి గేటు తీస్తుంటే మా వెనుకే రిక్షా దిగిన శ్రీధరం, "మామయ్యా! అమ్మ న న్నొంటివాడిని చేసి వెళ్లిపోయింది" అంటూ పెద్దగా ఏడుస్తూ వచ్చి మా వారిని చుట్టేశాడు. రమతోపాటే రిక్షా దిగిన పిల్లలు బిక్కమొహా లేసుకుని చూస్తున్నారు. రిక్షా అబ్బాయికి డబ్బు లిచ్చి పంపి వచ్చిన రమ నన్ను గట్టిగా పట్టుకుని, నా భుజం మీద తలాన్చి నిశ్శబ్దంగా రోదిస్తోంది.

నేను మాత్రం దాక్షా కోసం చూస్తున్నాను.

ఏదీ ఎక్కడుంది?

రమ కాస్త తేరుకున్నాక అడిగాను అదేమాట.

"అ దేమిటి? వా ళ్లింకా రాలేదా?" కన్నీళ్లు తుడుచుకుంటూ ఆశ్చర్యంగా చుట్టూ చూస్తూ అంది.

"ఎవరు?" అడిగాను.

"బాబాయి గారూ వాళ్లూ. రాత్రి అత్తయ్యకి ఆయాసం ఎక్కువయ్యేసరికి హాస్పటల్‌కి తీసుకెళ్లా రీయన. అక్కడ బాబాయిగారు వాళ్ల మనవ లెవరికో బాగుండలే దని వచ్చి తనకి కనిపించారట. అత్తయ్య తెల్లవారు ఝామున పోయారు. బాబాయిగారు, ఈయనతో మమ్మల్ని తీసుకుని ఇక్కడకు వచ్చేయమని, వాళ్లు అత్తయ్యని ఇక్కడికి తీసుకుని వస్తామని చెప్పారట. ఈయన ఇక్కడ ఏర్పాట్లు చూడాలి కదా అని మమ్మల్ని తీసుకుని బస్సుకి వచ్చారు. వాళ్లు టాక్సీలో వస్తా మన్నారట. ఈ పాటికి రావాలిగా? ఏరి?" అంది.

శ్రీధరం మా వారిని పట్టుకుని పొగిలి పొగిలి ఏడుస్తూ ఉన్నాడు.

ఇంతలో గేటులో కారు ఆగింది.

"వచ్చినట్టున్నారు" అన్నాను.

కారులో నుంచి దాక్షా అన్నగారు, వదినగారు, పిల్లలు దిగారు.

'దాక్షా ఏది?" ఆశ్చర్యంగా చూస్తున్నాను.

రమ నా రెండు భుజాలు గుచ్చి పట్టుకుని కారు వైపు ఆత్రంగా చూస్తోంది.

డిక్కీ తెరిచి, లోపల నుంచి దాక్షా శవం తీస్తుంటే నా మనస్సు లోతుల్లోంచి చీల్చుకుని వస్తున్న 'ఛీ'త్కారాన్ని బలవంతంగా అదిమిపెట్టి, శ్రీధరం కేసి చూశాను. తను మా వారి భుజం మీద త లాన్చి ఉండటంతో ఆ దృశ్యం కనపడే అవకాశం లేదు. అతడు అది చూడకూడదనో, ఏమో మా వారు తన చేతితో శ్రీధరం తలను గట్టిగా తన భుజానికి అదుముకున్నారు.

రమ ముఖం కోపంతో కందగడ్డ అయింది. ఆవేశంతో కళ్లు ఎర్రబడ్డాయి. నా భుజాలను గుచ్చి పట్టుకున్న చేతి వేళ్లు నన్ను మరింత నొక్కాయి. ఇం కొక్క క్షణం ఆగి ఉంటే ఏమి చేస్తుందో నని, "రమా! తాళం తీసి, చాప వేయమ్మా!" చెప్పాను.



ఏమనుకుందో - ఒక్క క్షణం నా ముఖంలోకి చూసి, తాళం తీసి చావ తెచ్చేసరికి దాక్షాను లోపలకు తీసుకొచ్చారు.

పడుకోబెట్టిన తరువాత దగ్గరకు వెళ్లాను. ప్రశాంతంగా ఉంది తన ముఖం ఎప్పటిలాగే!

'కళ్లు తెరిచి నన్ను చూడ దేం? వచ్చావా, వన్నూ అంటూ అప్యాయంగా నవ్వ దేం?' అనుకుంటూ తన వంకే దీక్షగా చూస్తుంటే -

"పిన్నిగారూ! ఒక్క సా రిలా రండి!" రమ నా చేయి పట్టుకుని అంటూ నన్ను ఇంట్లోకి తీసుకెళ్లింది.

లోపల కెళ్లాక 'ఏమిటి' అన్నట్లు తన వంక చూశాను.

"నిన్న మా చిన్నవాడి పుట్టిన రోజు. అత్తయ్యగారు నరదావడి చీర కట్టుకుని నాలుగు నగలూ పెట్టుకున్నారు. అలా ఉండగానే ఆయాసం రావడంతో అలాగే ఆస్పత్రికి వెళ్లారు. మరి ఇప్పుడు ఇలా ...." అంది బయటకి, దాక్షా వంక చూస్తూ.

అప్పుడు గమనించాను నేను. పాత టెర్లిన్ చీ రేదో బాగా మాసినది తనకి చుట్టబెట్టి ఉంది. అది కూడా దాదాపు మోకాళ్ల దాకా పైకి పోయి ఉంది. ముక్కుపుడక తప్ప మ రే వస్తువులూ ఒంటి మీద లేవు.

"చెల్లి శవం మీద వస్తువులు తీసి దాచుకుని వచ్చాడు పెద్దమనిషి, ఎంత నీచుడో చూశారా! పోన్లే! వస్తువులతోపాటు చీర తీయాలా? ఛ! అడగనా?" ఆవేశంగా అడిగింది నన్ను.

"వద్దు, రమా! అడిగితే తప్పు నీ దవుతుంది. 'అత్తగారే పోగా లేనిది, వస్తువుల కోసం బాధపడుతోంది' అంటారు. ఒక దుప్పటి తీసుకెళ్లి కప్పు. చూడటానికి బాగుండలేదు కదా! మగవాళ్లూ, వాళ్లూ కూడా వస్తూ ఉన్నారు. బావుండదు కదా అలా ఉంటే!" చెప్పాను.

తల ఊపి వెళ్లి దుప్పటి కప్పుతుంటే, దాక్షా అన్నగారు రమ దగ్గర కొచ్చి ఏదో అన్నాడు. రమ అతడివంక నిర్లక్ష్యంగా చూసి వచ్చేస్తుంటే, దాక్షా వదినగారు శవం నుంచి ముక్కుపుడక తీసే ప్రయత్నం ప్రారంభించింది.

రమ ఆమెను గమనించకనే నా దగ్గర కొచ్చి, 'కాస్సేపట్లో కాలిపోయే దానికి దుప్పటి దేనికమ్మా!' అంటున్నాడు అంది. ఇంతలో నా దృష్టి అటే ఉండటం గమనించి బయటకు చూసింది.

జరుగుతున్నది అర్థమయ్యేసరికి పట్టరాని కోపం వచ్చి నాతో -

"ఇక నన్ను ఆపద్దు, పిన్నిగారూ! వా ళ్లిక్కడ ఉండటానికి అర్హులు కాదు" అంటూ బయటకు నడిచింది.

అప్పటికే పరిస్థితులు చూస్తూంటే నా మనస్సు వికలమైపోయిం దేమో, ఇక రమని ఆపే ప్రయత్నం చేయలేకపోయాను.

"ఆగండి!" గర్జించింది రమ.

"మీరు మనుష్యులు కాదు, పశువులు! ఏమవుతుం దండీ ఈవిడ మీకు? తోడబుట్టిన చెల్లెలు కాదూ! ఈవిడ కష్టంలో ఏనాడైనా పాలువంచుకున్నారా? 'తింటున్నావా, లేదా! ఒక్క దానివీ పిల్లవాడిని ఎలా పెంచగలుగుతున్నావ్' అని అడిగారా ఏనాడైనా? 'నీ కే భయం లేదు, నే నున్నానమ్మా!' అని ధైర్యం చెప్పారా? అలా చూస్తారేమిటండీ! కట్టుకున్న చీర కూడా విప్పి తీసుకున్నారే శవం నుంచి. మీకు మన సెలా వచ్చిందండీ! ఆఁ, ఇప్పుడు కాలిపోయే దానికి దుప్పటి దేని కని అడిగారా? ముక్కుపుడక రావటంలేదని పీకుతున్నారా శవాన్ని! ఛీ! ఆవిడ డబ్బుతో ఆవిడ శవాన్ని తీసుకురావటానికి కూడా మీకు బాధేగా! డిక్కీలో పెట్టి తెస్తారా! అసలు మీ రెవరూ ఇక్కడ ఉండటానికి వీల్లేదు. నిన్నటి దాకా ఆవిడ ముఖం చూసి ఊరుకున్నాను. ఇక ఆ అవకాశం లేదు మీకు. ఇది నా ఇల్లు! ఆవిడ నా తల్లి! మీ రెవరూ ఇక్కడ ఉండక్కర్లేదు. వెళ్లండి, వెళ్లండి!"

రమ గర్జిస్తుంటే తలెత్తి చూసిన శ్రీధరం దగ్గరకు, "చూశావట్రా మీ ఆవిడ!" అంటూ వెళ్లాడు దాక్షా అన్నగారు.

"నాతో ఇం కేం మాట్లాడక్కర్లేదు. వెళ్లండి!" గేటువంక చూపిస్తూ అన్నాడు శ్రీధరం ఛీత్కారంగా.

కోపంగా అరుస్తూ వెళ్లిపోయారు వాళ్లంతా.

అప్పటికే పరిస్థి తేమిటో అర్థం కాక బిక్కమొహాలతో ఉన్న పిల్లలు భయం భయంగా చుట్టూ చేరేసరికి వాళ్లను దగ్గరకు తీసుకుంటూ, 'నువ్వు గెలిచావు, దాక్షా!' అనుకున్నాను కళ్లు మూసుకుని!

'కొడుకునే కాదు, కోడలినీ గెలుచుకున్నావు. దక్షత గల కోడలిని గెలుచుకున్నావ్!' అనుకున్నాను.

●

